క్లుప్తంగా

ముమ్మరంగా వాహనాల తనిఖీలు

మానవపాడు: మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్ల వద్ద ఎస్‌ఐ చంద్రకాంత్ ఆధ్వర్యంలో సోమవారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వాహన దారులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. మద్యం తాగి వాహనం నడిపిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తులు కార్యాలయంలో అందజేయాలి

మానవపాడు: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు అందిస్తున్న రాజీవ్ యువవికాసం పథకానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులు అట్టి దరఖాస్తును ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలని ఎంపీడీఓ భాస్కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తెలంగాణ ఉద్యమకారుడు మృతి


రతంగపాణిరెడ్డి (ఫైల్)

అయిజ: మండల పరిధిలోని ఉప్పల గ్రామంలో తెలంగాణ మలిదశ ఉద్యకారుడు రతంగపాణిరెడ్డి (82) సోమవారం మృతిచెందారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో మండలంలోని ప్రజలను చైతన్యం చేసి ఉద్యమంలో కీలకపాత్ర పోషించినట్లు గ్రామస్తులు తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్‌తో కలిసి అలంపూర్‌‌– గద్వాల పాదయాత్రలో పాల్గొన్నారు. వివిధ పార్టీల, సంఘాల నాయకులు ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

బీచుపల్లిలో ప్రత్యేక అభిషేకాలు



ఎర్రవల్లి: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు పరమశివుడికి అభిషేకాలు చేశారు. చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

ట్రాక్టర్ రివర్స్ గేర్ పోటీలు



అలంపూర్ రూరల్: పట్టణంలో వివేకనంద యూత్ ఆధ్వర్యంలో ఉగాదిని పురస్కరించుకొని సోమవారం ట్రాక్టర్ రివర్స్ గేర్ పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి రూ.3వేలు, రెండో బహుమతి రూ.2 వేలు, మూడో బహుమతి రూ.1500ను విజేతలకు దాతలు అందజేశారు. మొదటి బహుమతి అక్బర్‌పేటకు చెందిన శేఖర్, రెండో బహుమతి అంబేడ్కర్ కాలనీకి చెందిన రాము, మూడో బహుమతి న్యూప్లాట్స్ ఏసేప్ గెలుచుకున్నట్లు నిర్వాహకులు వెంకటరమణ, మనోహర్, నాయుడు వివేకనంద యూత్ సభ్యులు తెలిపారు.

పిచ్చికుక్క స్వైర విహారం

అలంపూర్ రూరల్ : అలంపూర్ పట్టణంలోని సంతోష్‌నగర్, అంబేడ్కర్ కాలనీలో పిచ్చికుక్క స్వైర విహారం చేస్తుంది. సోమవారం పలువురిపై దాడిచేసి గాయపరిచినట్లు కాలనీ వాసులు పేర్కొన్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కల బారి నుంచి కాపాడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన

అమరచింత: వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ సోమవారం ముస్లింలు నల్లబ్యాడ్జీలు, ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మొండి వైఖరిని ఖండిస్తూ నినాదాలు చేశారు. దేశంలో నివసించే స్వేచ్ఛ ప్రతి ఒక్కరికి ఉందని, మతాలకు సంబంధించి ఆస్తులను పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కలాం, ఖదీర్, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.




నందిన్నె ఈద్గావద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


అలంపూర్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


పుల్లూరులో ముస్లింలతో ఎమ్మెల్యే విజయుడు


గట్టు ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


సాతర్లలో ఈద్గా వద్ద ప్రార్థనలో ముస్లింలు


ఎం.ఆర్‌చెర్వులో శుభాకాంక్షలు తెలుకొంటున్న ముస్లింలు

ఘనంగా రంజాన్ వేడుకలు


మానవపాడులో ప్రార్థనలు చేసున్న ముస్లింలు


రాజోళిలో రంజాన్ సందర్భంగా ప్రార్థనలు

సాక్షి నెట్‌వర్క్: కులమతాలకు అతీతంగా అందరూ సంతోషంగా జీవించాలని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. జిల్లా వ్యాప్తంగా రంజాన్ సంబురాలు అంబరాన్నంటాయి. నెల రోజుల పాటు ఉపావాస దీక్షలు చేసి ఆదివారం సాయంత్రం నెలవంక కనిపించడంతో సోమవారం రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించారు. మసీదులు, ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనల అనంతరం రంజాన్ సందేశాన్ని వినిపించారు. కులమతాలకు అతీతంగా సర్వ మానవాళి సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థనలు చేసినట్లు ఇమామ్, మౌజమ్‌లు పేర్కొన్నారు. అల్లాను స్మరిస్తూ ఈద్గాల్లో ఈద్ ఉల్ ఫితర్ ప్రత్యేక సమాజ్ చేశారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వేడుకల్లో చిన్నారులు రంగురంగుల వస్త్రాలతో ఆకర్షణగా నిలిచారు. స్థానిక ఎమ్మెల్యేలు, నాయకులు, ప్రజా ప్రతినిధులు ముస్లింలకు మసీదులు, ఈద్గాల వద్ద పండుగ శుభాకాంక్షలు తెలిపి విందు ఏర్పాట్లు చేశారు.


ఉండవెల్లిలోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు


దుబాయ్ షేక్ డ్రస్సులతో చిన్నారులు


ధరూరులోని ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


ధరూరులో ఈద్గా వద్ద ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న బండ్ల సాయిసాకేత్ రెడ్డి


శుభాకాంక్షలు తెలుపు కొంటున్న చిన్నారులు


ధరూరులో ఈద్గా వద్ద చిన్నారులకు స్వీట్లు పంచిపెడుతున్న పోలీసులు

పురాతన బావులను సంరక్షించాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత

గద్వాల: సంస్థానదీశుల కాలంలో నిర్మించిన పురాతన బావులను కబ్జా నుంచి కాపాడాలని, అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. సోమవారం మాజీ మున్సిపల్ చైర్మన్ కేశవ్‌తో కలిసి కలెక్టరేట్‌లో కలెక్టర్ బీఎం సంతోష్‌కు వినతిపత్రం అందించారు. అనంతరరం విలేకర్లతో మాట్లాడుతూ.. గద్వాలలో ప్రభుత్వ భూములు కొందరు అక్రమ మార్గంలో కబ్జాచేస్తున్నారన్నారు. చింతలపేటలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న కొత్తబావిని కబ్జా చేట్టినట్లు తెలిపారు. దీని వెనుక కాంగ్రెస్‌కు చెందిన బడాబాబులు ఉన్నారని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో కొత్తబావిని సంరక్షించాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దస్తగిరయ్యకు మొక్కుల చెల్లింపు



రాజోళి: మండలంలోని పచ్చర్ల గ్రామంలో వెలిసిన దస్తగిరయ్య దర్గా వద్ద గ్రామస్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం నుంచి ఉర్సు ఉత్సవాలు ప్రారంభం కాగా.. సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉర్సు సందర్భంగా వాలీబాల్, బ్యాండ్ మేళాల పోటీలు, స్లోబైక్ రేస్ పోటీలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలు ముఖ్యమే

అయిజ: మండలంలోని బైనిపల్లి గ్రామంలో సోమవారం క్రికెట్ లీగ్ సీజన్– 9 ప్రారంభించారు. ముఖ్య అతిథిగా బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు సంకాపురం రాముడు హాజరై రిబ్బన్ కట్‌చేసి లీగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రాముడు మాట్లాడారు. క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి మేలు చేకూరుస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు. చదువులు ఎంత ముఖ్యమో, క్రీడలు కూడా అంతే ముఖ్యమన్నారు. కార్యక్రమంలో క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


క్రికెట్ లీగ్ ప్రారంభిస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు రాముడు

కేంద్రమంత్రిని కలిసిన నాయకులు



గద్వాల: బీజేపీ జిల్లా నూతన అధ్యక్షుడిగా నియామకమైన రామాంజనేయులు సోమవారం హైదరాబాదులో కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమాభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించినట్లు రామాంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా కలశాల ప్రతిష్ఠ

దేవరకద్ర: మండల కేంద్రంలో వందల సంవత్సరాల చరిత్ర ఉన్న శివాలయం, వీరప్పయ్యస్వామి దేవాలయాలపై కలశాల ప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. నవగ్రహ, నాగదేవత విగ్రహాల పునఃప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. రెండు రోజులుగా పూజలు, హోమాలు నిర్వహించారు. ప్రతిష్ఠాపనలో దేవస్థాన కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, నాయకులు కొండ ప్రశాంత్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రఘువీర్‌వర్మ, ఆదిహన్మంతరెడ్డి, జవహర్, రాంపాండు, శ్రీకాంత్‌యాదవ్, శివానంద్, వెంకటేశ్, దేవన్న, కేపీ రాజు, చంద్రయ్య పాల్గొన్నారు.

కలశాలను ప్రతిష్ఠించిన ఎమ్మెల్యే

దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి దంపతులు కలశ ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. హోమంలో పాల్గొని కలశాలతో దేవాలయం చుట్టు ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే గాలి గోపురంపైకి ఎక్కి కలశాలను ప్రతిష్ఠించారు. దేవస్థాన కమిటీ వారు ఎమ్మెల్యే దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భక్తులు, నాయకులు, దాతలు పాల్గొన్నారు.


దేవరకద్రలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి దంపతులు

ప్రొటోకాల్‌పై బీఆర్‌ఎస్ నాయకుల ఆవేదన

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలో సోమవారం రహెమానియా ఈద్గా వద్ద ప్రొటోకాల్‌పై బీఆర్‌ఎస్ నాయకులు కొంత ఆవేదన వ్యక్తం చేశారు. ఈద్గా ఆవరణలో ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలపడానికి వేదిక ఏర్పాటు చేశారు. వేదికపైన కుర్చీలలో ప్రముఖుల పేరుల్ వేశారు. అయితే మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేరు విషయంలో ప్రొటోకాల్ పాటించలేదని బీఆర్‌ఎస్ నాయకులు అసహనం వ్యక్తం చేశారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

రాజోళి: బీసీలపై జనసేన పార్టీ నాయకుల దాడులు దుర్మార్గమని గౌడ సంఘం మండల ప్రధాన కార్యదర్శి సిద్దయ్య గౌడ్, సీనియర్ నాయకుడు మద్దిలేటి గౌడ్ అన్నారు. సోమవారం వారు సాక్షితో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లోని నందమూరు గ్రామానికి చెందిన మైనర్ బాలుడు కాసాని రాజేష్‌పై జనసేన నాయకులు దాడి చేయడం వల్ల మృతి చెందిన విషయం దారుణమన్నారు. బాలుడి మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

రుణమాఫీ కాదాయె!


రూ.2లక్షలకు పైగా ఉన్న రుణాలు మాఫీ చేయాలని పీఏసీఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న రైతులు(ఫైల్)

- మాఫీ కోసం రైతన్నల ఎదురుచూపులు
- వివిధ కారణాలతో అందని రుణమాఫీ
- రూ.2 లక్షలకు పైగా ఉన్న రైతుల్లో ఆందోళన

మానవపాడు: అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తామన్న హామీని ఇంత వరకు పూర్తిస్థాయిలో అమలు చేయలేదు. వివిధ కారణాలతో రూ. లక్షలోపు రుణమాఫీ కాని రైతులు దాదాపు జిల్లా వ్యాప్తంగా ఉన్న 13 మండలాల్లోని ప్రతి మండలంలో 30 శాతం మంది రైతులు పైగానే ఉన్నారు. రూ.2లక్షలు వరకు అరకొరగా రుణమాఫీ చేసిన ప్రభుత్వం రూ.2లక్షలకు పైగా రుణం పొందిన వారికి ఎప్పుడు మాఫీ చేస్తారని రైతులు ప్రశ్నిస్తున్నారు. రూ. 2లక్షల వరకే రుణమాఫీ చేస్తారా ఆపైన రుణం ఉన్నవారికి మొండిచేయి చూపిస్తారంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు ఇప్పటికే రుణ మాఫీ మొత్తం పూర్తి చేసినట్లు ప్రభుత్వం ప్రకటించడంతో రైతుల్లో ఆందోళన మరింత ఎక్కువై అధికారుల వద్దకు పరుగులు తీస్తున్నారు.

విధివిధానాలేవి..?

ప్రభుత్వం రూ.2 లక్షలకు పైగా రుణమాఫీ సంబంధించి ఎలాంటి విధివిధానాలు ప్రకటించలేదు. రైతులకు సంబంధించి ఉత్తర్వుల్లో ఒకే ఒక అంశాన్ని ప్రస్తావించింది. రూ. 2లక్షలకు పైగా రుణం ఉన్న రైతులు ముందుగా రూ. 2లక్షలకు పైగా ఎంత రుణం ఉందో ఆ మొత్తాన్ని బ్యాంకుల్లో జమచేస్తే ప్రభుత్వం రూ.2 లక్షలు జమ చేస్తుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో రూ.2 లక్షల రుణం ఉన్నవారు రుణం ఎలా చెల్లించాలి.. బ్యాంకుల్లో, ఆధార్ కార్డులో పేర్లలో తప్పులు ఉన్నా వారి రుణాలు ఏ విధంగా, ఎప్పుడు మాఫీ చేస్తారని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం చూస్తుంటే రుణమాఫీ రైతులకు ఎగవేత ధోరణి కనిపిస్తుందంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆత్మహత్యలే శరణ్యం



అసెంబ్లీ సాక్షిగా రుణ మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ రూ.2 లక్షలకు పైగా ఉన్న రుణాలు ఇంత వరకు చేయలేదు. మిరప పంటవేసి గిట్టుబాటు ధరలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. రుణమాఫీ చేయకుంటే రైతులకు ఆత్మహత్యలే శరణ్యం.

– శంకర్‌గౌడ్ రైతు అమరవాయి

మాటతప్పితే ఎలా సారూ..



ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఎన్నికల హామీలో భాగంగా రూ.2 లక్షలపైగా ఉన్న రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కడ ప్రచారం చేసినా దేవుళ్లపై ఒట్టు వేసి రుణమాఫీ చేస్తామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి.

– భీమరాజ్, గోకులపాడు

నేరుగా రైతుల ఖాతాల్లో జమ..



ప్రభుత్వం నుంచి రూ.2 లక్షలకు పైగా ఉన్న రుణం మాఫీ చేస్తే నేరుగా రైతుల ఖాతాలో జమ అవుతాయి. రూ.2 లక్షలకు పైగా రుణం తీసుకున్న వారి రుణమాఫీ ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంది.

–అయ్యపురెడ్డి
లీడ్ బ్యాంక్ మేనేజర్, గద్వాల

శిథిలావస్థలో పశువైద్య కేంద్రం

మల్దకల్: మండలంలోని బిజ్వారం పశువైద్య కేంద్రానికి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. 20 ఏళ్ల క్రితం నిర్మించిన పశువైద్య కేంద్రం శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు కూలి ఏ ప్రమాదం జరుగుతుందోనని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పశువైద్య కేంద్రానికి మరమ్మతు లేదా నూతన భవనం నిర్మించాలని కోరుతున్నారు.


శిథిలావస్థలో బిజ్వారం పశువైద్య కేంద్రం

అంబేడ్కర్ స్ఫూర్తి ప్రదాత

మహబూబ్‌నగర్ రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తి ప్రదాత అని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఏప్రిల్ 14న రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని జరిగే బహుజన మహనీయుల శోభాయాత్ర కరపత్రాలను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజన మహనీయుల శోభాయాత్ర పేరుతో మంచి కార్యక్రమానికి నిర్వాహకులు శ్రీకారం చుట్టారన్నారు. వారి ఆశయాలను ముందు తరాలకు అందించటానికి కృషి చేయాలని సూచించారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమ ఉద్దేశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లిందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, నాయకులు ప్రవీణ్ కుమార్, రవికిరణ్, శోభాయాత్ర కమిటీ నాయకులు సింగిరెడ్డి పరమేశ్వర్, పాతూరు రమేష్, వినయ్, టి.నవీన్‌కుమార్, శివ పాల్గొన్నారు.

పూలే, అంబేడ్కర్ జాతర పోస్టర్ ఆవిష్కరణ

మహబూబ్‌నగర్ రూరల్: పూలే, అంబేడ్కర్ జాతర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 27న జిల్లా కేంద్రంలోని ఎంబీసీ మైదానంలో నిర్వహించనున్న పూలే, అంబేడ్కర్ జాతర వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. పూలే– అంబేడ్కర్ జాతర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నర్సింహులు, బాలరాజు, వెంకటస్వామి, సామెల్, లక్ష్మణ్, యాదగిరి నాయక్, జంగయ్య, మాసయ్య, ఆది విష్ణువర్ధన్, విద్యావతి, బాబమ్మ, నర్సింహులు, ఆంజనేయులు పాల్గొన్నారు.


బహుజన మహనీయుల శోభాయాత్ర కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

నూతన సంవత్సరంలో విజయాలు అందించాలి

మహబూబ్‌నగర్ రూరల్: శ్రీ విశ్వవసు నామ సంవత్సర ఉగాది మనందరికి విజయాలను కీర్తిని అందించాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆకాంక్షించారు. శ్రీ విశ్వవాసు నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని కోడూర్‌లో శ్రీ వరదరాజులస్వామి బండ్లు తిరిగే వేడుకకు ఆయన హాజరయ్యారు. అనంతరం గ్రామంలో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ ఆవరణలో వరదరాజులుస్వామి వారి బండ్లు తిరిగే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

సింగంపేటలో తాగునీటి పునరుద్ధరణ



అమరచింత: మండలంలోని సింగంపేటలో నిరంతరం తాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు మిషన్ భగీరథ ఈఈ మేఘారెడ్డి తెలిపారు. 'సాక్షి' దినపత్రికలో సోమవారం సింగంపేటలో తాగునీటి ఎద్దడి అనే కథనంతో వార్త ప్రచురితం కావడంపై ఈఈ స్పందించారు. ఈమేరకు ఏఈ తో మాట్లాడి తాగునీటి సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకున్నారు. వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

హుండీ ఆదాయం రూ.25వేలు

మిడ్జిల్: మండల కేంద్రంలోని వాడిక వేంకటేశ్వర స్వామి హుండీని సోమవారం లెక్కించగా రూ.25,678 ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆరు నెలల హుండీని లెక్కించినట్లు తెలిపారు. కార్యక్రమం లో గ్రామపెద్దలు రాజేశ్వర్, బంగారు, తిరుపతి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

